కలం
ప్రజల గళం...
kalamdaily.com
Follow on: Kalamtelugu
360° SINGLE TOPIC
డీలిమిటేషన్
శుక్రవారం ● 27.03.2026
పేజీలు: 5




# సౌత్ వర్సెస్ నార్త్
# డీలిమిటేషన్

**జనాభా ప్రాతిపదికన ఒప్పుకోబోమంటున్న దక్షిణాది**

**కేంద్రం తీరు 'కుటుంబ నియంత్రణ'కు పెనాల్టీలా ఉందని వాదన**

మరో 25 ఏండ్లు వాయిదా.. లేదంటే 33% వాటా ఇవ్వాలని డిమాండ్

నియోజకవర్గాల పునర్విభజనకు కేంద్రం కసరత్తు

లోక్‌సభ, అసెంబ్లీల్లో 50% సీట్లు పెంచేందుకు ప్రణాళిక

**నియోజకవర్గాల పునర్విభజన.. దశాబ్దాలుగా పొలిటికల్ పార్టీల్లో ఇదో డిబేట్! ఇందిరాగాంధీ హయాంలో జరిగింది. ఆ తర్వాత దాని ఊసే లేదు. మధ్యలో ఓసారి జరిగినా కేవలం హద్దుల మార్పు వరకే. ఇప్పుడు తప్పక చేసి తీరుతామని కేంద్ర ప్రభుత్వం చెప్తున్నది. ఇందుకోసం ప్రాసెస్ కూడా రెడీ చేసింది. దానిపై రాష్ట్రాలూ స్పందించాయి. కానీ, అనుసరించే విధానంపైనే అనుమానాలు. డీలిమిటేషన్ ఫార్ములాపై ఇప్పటికీ క్లారిటీ లేదు. సౌత్‌కు నష్టం జరిగేలా కేంద్రం చర్యలు ఉన్నాయన్నది తెలంగాణ, తమిళనాడు, కేరళ, ఏపీ, కర్నాటక రాష్ట్రాల వాదన. ఇందుకోసం సౌత్ స్టేట్స్ నేతలు ఒక్కటవుతున్నారు. పలు ప్రతిపాదనలను ముందుకు తెస్తున్నారు. వాటి ప్రకారం డీలిమిటేషన్ చేపడితేనే దక్షిణాదికి న్యాయం జరుగుతుందంటున్నారు. గతంలో చేపట్టినట్టు జనాభా ప్రాతిపదికన చేయాలని కేంద్రం చూస్తున్నదని.. అలా చేస్తే కేంద్రంలో అధికారంలోకి రావడానికి ఉత్తరప్రదేశ్, బిహార్, రాజస్థాన్, మధ్యప్రదేశ్ వంటి రాష్ట్రాల సీట్లు సరిపోతాయని, దీని వల్ల సౌత్‌కు తీరని అన్యాయం జరుగుతుందని ఇక్కడి నేతల ఆందోళన. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి సౌత్‌పై ఎప్పుడూ చిన్న చూపే ఉంటున్నదని.. ఇప్పుడు దాన్ని మరింత పెంచేలా కేంద్రం తీరు కనిపిస్తున్నదని మండిపడుతున్నారు.**

**అసలు డీలిమిటేషన్ చేపట్టాల్సిన అవసరం ఏమొచ్చింది? గతంలో ఎప్పుడు జరిగింది? అనుసరించిన విధానమేంటి? తెరమీదికి వస్తున్న 'కుటుంబ నియంత్రణ' అంశం వెనుక అసలు వాస్తవం ఏమిటి? సౌత్ రాష్ట్రాల వాదనలో ఉన్న బలమెంత? కేంద్రం మనసులో డీలిమిటేషన్ ఫార్ములా ఏంటి? దాని ఆలోచనేంటి? దక్షిణాది నేతలు అనుమానిస్తున్నట్లు జరిగితే.. జరిగే నష్టం ఏమిటి?, ఎవరికి?.. వీటిపై కలం 360 డిగ్రీస్ ప్రత్యేక కథనం..**

- తెలంగాణ బ్యూరో, కలం



## 'జనాభా నియంత్రణ'కు ఇది శిక్షా?

- జనాభా దామాషా ప్రకారం నియోజకవర్గాల సంఖ్యను పెంచుతున్నందున.. జనాభా నియంత్రణను ప్రోత్సహించాలన్న ఉద్దేశంతో డీలిమిటేషన్‌ను 25 ఏండ్ల పాటు (2001 వరకు) వాయిదా వేస్తున్నట్టు 1976లో అప్పటి ఇందిరాగాంధీ ప్రభుత్వం ప్రకటించింది.
- ఇందుకోసం 42వ రాజ్యాంగ సవరణ తీసుకొచ్చింది. ఆ టైమ్‌లో లోక్‌సభ సీట్ల సంఖ్య 543. అప్పటి నుంచి ఆ సంఖ్య మారలేదు. జనగణన చేపట్టిన ప్రతిసారీ లోక్‌సభ/ రాష్ట్రాల అసెంబ్లీ నియోజకవర్గాల సరిహద్దులు మాత్రమే మార్చారు. సీట్ల సంఖ్యను ఎక్కడా పెంచలేదు.
- రాష్ట్రాలు జనాభా నియంత్రణకు మరింత కృషి చేయాలని 2001లో అప్పటి వాజ్‌పేయి ప్రభుత్వం డీలిమిటేషన్‌ను మరో 25 ఏండ్ల పాటు (2026 వరకు) వాయిదా వేసింది. ఇందుకోసం 84వ రాజ్యాంగ సవరణ తీసుకొచ్చింది. మొత్తంగా జనాభా నియంత్రణను ప్రోత్సహించడం కోసం కేంద్ర ప్రభుత్వం 50 ఏండ్ల పాటు డీలిమిటేషన్‌ను వాయిదా వేస్తూ వచ్చింది.
- ఈ 50 ఏండ్లలో దక్షిణాది రాష్ట్రాలు జనాభా నియంత్రణ చర్యలు కఠినంగా చేపట్టాయి. ఫలితంగా నార్త్‌తో పోలిస్తే సౌత్ స్టేట్స్‌లో జనాభా భారీగా తగ్గిపోయింది.

ఇప్పుడు జనగణన ఆధారంగా డీలిమిటేషన్ చేపడితే అన్యాయం జరుగుతుందన్నది, ఇది జనాభా నియంత్రణ పాటించినందుకు తమపై వేస్తున్న శిక్షలా ఉంటుందని సౌత్ స్టేట్స్ వాదన. జనాభా దామాషా ప్రకారం కాకుండా అన్ని రాష్ట్రాలకు న్యాయం జరిగేలా డీలిమిటేషన్ ప్రక్రియ ఉండాలన్నది డిమాండ్.

## దేశ జనాభా ఇలా..!

- ఇందిరాగాంధీ టైమ్‌లో 1971లో దేశ జనాభా 54.79 కోట్లు. వాజ్‌పేయి టైమ్‌లో 2001లో జనాభా 102.87 కోట్లు. 2011 జనగణన ప్రకారం 121.08 కోట్లు. ప్రస్తుతం జనాభా 143 కోట్లు ఉంటుందని అంచనా.
- 1971లో సౌత్ రాష్ట్రాల జనాభా 13.5 కోట్లు.. 2001లో 22.2 కోట్లు.. 2011లో 25.1 కోట్లు.. ప్రస్తుతం 29 కోట్లు ఉంటుందని అంచనా.

## దక్షిణాది రాష్ట్రాలకు నష్టం



జనాభా ప్రాతిపదికన డీలిమిటేషన్ చేపడితే జనాభా తక్కువగా ఉన్న దక్షిణాది రాష్ట్రాల ఎంపీ సీట్లు తగ్గి, ఉత్తరాది రాష్ట్రాల సీట్లు పెరిగే అవకాశం ఉంది. జనాభా నియంత్రణను సమర్థవంతంగా అమలు చేసిన దక్షిణాది రాష్ట్రాలను శిక్షించడం సరికాదు. ఇది భారత సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధం. డీలిమిటేషన్ ప్రక్రియ శాస్త్రీయంగా జరగాలంటే ముందుగా కులగణన జరగాలి. దేశంలో ఏ వర్గం జనాభా ఎంత ఉందో తెలియనప్పుడు.. నియోజకవర్గాల విభజన ఎలా సరైన ప్రాతినిధ్యాన్ని ఇస్తుంది? ముఖ్యంగా ఓబీసీ మహిళలకు ప్రత్యేక కోటా ఉండాలి. దానికి కులగణన డేటా ప్రాతిపదిక కావాలి.

**- రాహుల్ గాంధీ, లోక్‌సభ ప్రతిపక్ష నేత**

## సౌత్ సీఎంలు ఏకం కావాలి




కేంద్ర ప్రభుత్వ సూచనల మేరకు జనాభా నియంత్రణను పాటించి.. సామాజిక అభివృద్ధిలో దూసుకుపోతున్న తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ వంటి రాష్ట్రాలను డీలిమిటేషన్ పేరుతో శిక్షించడం ఏంటి? జనాభాను నియంత్రించినందుకు మా సీట్లను తగ్గించడం అంటే.. మేము చేసిన మంచి పనికి మాకు ఇస్తున్న శిక్షే. డీలిమిటేషన్ అనేది కేవలం తమిళనాడు సమస్య మాత్రమే కాదు. ఇది మొత్తం దక్షిణ భారతదేశం మనుగడకు సంబంధించిన సమస్య. దీనిపై పోరాడేందుకు అన్ని దక్షిణాది రాష్ట్రాల సీఎంలు, ప్రాంతీయ పార్టీలు ఏకం కావాలి.

**- ఎంకే స్టాలిన్, డీఎంకే అధినేత, తమిళనాడు సీఎం**



## సీట్ల కెపాసిటీ పెంపు వెనుక..?

కేంద్ర ప్రభుత్వం నిర్మించిన కొత్త పార్లమెంట్‌లోని లోక్‌సభలో మొత్తం సీటింగ్ కెపాసిటీని 888కి చేర్చింది. రాజ్యసభలో 388కు చేర్చింది. డీలిమిటేషన్‌ను ముందే ఊహించిన మోదీ సర్కార్ ఆ మేరకు కొత్త భవనంలో సీట్ల కెపాసిటీని పెంచినట్లు రాజకీయవర్గాలు అంటున్నాయి.




## రాజ్యాంగంలో ఏముంది?

నియోజకవర్గాల పునర్విభజన(డీలిమిటేషన్)కు సంబంధించి భారత రాజ్యాంగంలో స్పష్టమైన నిబంధనలు ఉన్నాయి. ప్రతి జనగణన తర్వాత ఆర్టికల్ 82, ఆర్టికల్ 170 ప్రకారం డీలిమిటేషన్ చేపట్టాలి. జనాభా లెక్కల ఆధారంగా లోక్‌సభ, రాష్ట్రాల అసెంబ్లీ స్థానాలను సర్దుబాటు చేయడం, పెంచడం లాంటివి చేయాల్సి ఉంటుంది. సాధారణంగా ప్రతి పదేండ్లకు ఒకసారి కేంద్రం జనగణన చేపడుతుంది. చివరిసారి 2011లో చేపట్టింది. కరోనా కారణంగా 2021లో వాయిదా వేసింది. ఇప్పుడు 2027లో చేపట్టనుంది.

## 2029లోనే డీలిమిటేషన్


నిజానికి 2021లోనే జనగణన జరగాలి. కానీ కరోనా కారణంగా కేంద్రం వాయిదా వేసింది. ఆ తర్వాత కరోనా పూర్తిగా తగ్గినా చేపట్టలేదు. దీనిపై ప్రతిపక్షాలు ఎప్పటి నుంచో ప్రశ్నిస్తున్నాయి. జనగణన చేపట్టాలని డిమాండ్ చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో జనగణన షెడ్యూల్‌ను కేంద్రం ఇటీవల ప్రకటించింది. 2027 మార్చి 1కల్లా పూర్తయ్యేలా ప్రణాళిక రెడీ చేసింది.

- 2027 మార్చి నాటికి జనాభా లెక్కల సేకరణ పూర్తయినా, ఫైనల్ రిపోర్టు రావడానికి ఒకట్రెండు సంవత్సరాల సమయం పడుతుందని.. ఈ లెక్కన 2029 సాధారణ ఎన్నికలకు ముందు డీలిమిటేషన్ ప్రక్రియ ఉండదని రాజకీయ విశ్లేషకులు అంచనా వేశారు. 2034 ఎన్నికలకు ముందు ఉంటుందని అనుకున్నారు. అయితే ఈసారి జనగణన పూర్తిగా డిజిటల్‌గా చేపట్టాలని కేంద్రం నిర్ణయించింది. ప్రాథమిక గణాంకాలు వెలువడిన తర్వాత 9 నెలల లోపు ఫైనల్ రిపోర్టు రెడీ చేయాలని టార్గెట్ పెట్టుకుంది. అంటే 2027 చివరి నాటికి జనగణన పూర్తి స్థాయి నివేదిక వస్తుంది.
- జనగణన ఫైనల్ రిపోర్టు వచ్చిన వెంటనే డీలిమిటేషన్ ప్రక్రియ చేపట్టాలని కేంద్రం భావిస్తున్నది. 2029 ఎన్నికల నాటికి ఆ ప్రక్రియను పూర్తి చేయాలని కసరత్తు చేస్తున్నది.

## సౌత్ స్టేట్స్ డిమాండ్ ఇదీ..

జనాభా దామాషా ప్రకారం డీలిమిటేషన్ చేపడితే అన్యాయం జరుగుతుందని దక్షిణాది రాష్ట్రాలు ఎప్పటి నుంచో ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఇప్పుడు కేంద్రం కసరత్తు నేపథ్యంలో ఆ రాష్ట్రాలు మళ్లీ వాయిస్ వినిపిస్తున్నాయి. జనాభా ప్రాతిపదికన కాకుండా ఇతర పద్ధతుల్లో అందరికీ న్యాయం జరిగేలా డీలిమిటేషన్ ఉండాలని డిమాండ్ చేస్తున్నాయి. డీలిమిటేషన్‌కు వ్యతిరేకంగా సౌత్ స్టేట్స్ ఇప్పటికే పోరాటం ప్రారంభించాయి. 2025 మార్చి 5న చెన్నైలో అఖిలపక్షం సమావేశం, ఆ తర్వాత మార్చి 22న జేఏసీ మీటింగ్ నిర్వహించాయి. దీనికి తెలంగాణ, తమిళనాడు, కర్నాటక, కేరళ, పంజాబ్ హాజరై కొన్ని డిమాండ్స్ చేశాయి.


- గతంలో లాగే మరో 25 ఏండ్ల పాటు లోక్‌సభ సీట్ల సంఖ్యలో ఎలాంటి మార్పులు చేయొద్దు.
- ఒకవేళ డీలిమిటేషన్ ప్రక్రియ చేపట్టాలనుకుంటే సీట్ల సంఖ్యలో మార్పు లేకుండా.. నియోజకవర్గాల హద్దులు మాత్రమే మార్చాలి.
- ప్రస్తుతమున్న 543 లోక్‌సభ సీట్లలో దక్షిణాది రాష్ట్రాల వాటా 24 శాతమే (130 సీట్లు). డీలిమిటేషన్ తర్వాత దక్షిణాది రాష్ట్రాలకు 33 శాతం వాటా సీట్లు ఇవ్వాలి.
- ప్రస్తుతమున్న లోక్‌సభ సీట్లను 50 శాతం పెంచాలని కేంద్రం అనుకుంటే.. అప్పుడు మొత్తం లోక్‌సభ సీట్లు 815 అవుతాయని, అందులో 33 శాతం అంటే 272 సీట్లు దక్షిణాది రాష్ట్రాలకు ఇవ్వాలని సీఎం రేవంత్ రెడ్డి డిమాండ్ చేశారు.



## కేంద్రం ఏం చెబుతున్నది?

దక్షిణాది రాష్ట్రాల వ్యతిరేకత నేపథ్యంలో డీలిమిటేషన్‌పై సరికొత్త ప్రతిపాదనను కేంద్రం తెరపైకి తెచ్చింది. ఇప్పుడు నిర్వహించనున్న జనగణనను పరిగణనలోకి తీసుకోకుండా, 2011 జనాభా లెక్కల ఆధారంగానే డీలిమిటేషన్ చేపట్టేందుకు సిద్ధమైంది. అన్ని రాష్ట్రాల్లో ప్రస్తుతమున్న లోక్‌సభ, అసెంబ్లీ సీట్లను సగటున 50% పెంచాలని భావిస్తున్నది. ఇందుకు అన్ని రాజకీయ పార్టీలను ఒప్పించేందుకు కసరత్తు చేస్తున్నది.

- అయితే ఇలా చేసినా తమకు అన్యాయమే జరుగుతుందన్నది సౌత్ స్టేట్స్ వాదన. ఇప్పటికే నార్త్‌లో లోక్‌సభ సీట్లు ఎక్కువగా ఉన్నాయని, 50% పెంపుతో వాళ్లకే లబ్ధి జరుగుతుందని దక్షిణాది నాయకులు పేర్కొంటున్నారు.



### 50% లెక్కన చేస్తే సీట్ల పెంపు ఇలా..

| | ప్రస్తుతం | పెరిగేవి | మొత్తం |
|---|---|---|---|
| లోక్‌సభ | 543 | 273 | 816 |
| తెలంగాణ అసెంబ్లీ | 119 | 60 | 179 |
| తెలంగాణ లోక్‌సభ | 17 | 9 | 26 |



## ప్రతిపక్షాలను బలహీనపర్చే కుట్ర

జనాభా నియంత్రణ పాటించిన పశ్చిమబెంగాల్, దక్షిణాది రాష్ట్రాల లోక్‌సభ సీట్ల సంఖ్య తగ్గడం లేదా పెరగకపోవడంతో పార్లమెంటులో ఆయా రాష్ట్రాల గొంతు బలహీనపడుతుంది. ఉత్తరాది రాష్ట్రాలకు ఎక్కువ సీట్లు రావడంతో దేశ రాజకీయాల్లో ఒకే ప్రాంతం ఆధిపత్యం పెరుగుతుంది. నియోజకవర్గాల సరిహద్దులను మార్చడం ద్వారా ప్రతిపక్షాలు బలంగా ఉన్న ప్రాంతాలను విడగొట్టే ప్రమాదం ఉంది. డీలిమిటేషన్ ప్రక్రియలో ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ వర్గాలకు జనాభా ప్రకారం సరైన న్యాయం జరగాలి. ముస్లిం మైనారిటీల ప్రాతినిధ్యం తగ్గకుండా చూడాలి. డీలిమిటేషన్ సాకుతో మహిళా రిజర్వేషన్లను 2029 లేదా ఆ తర్వాతకు వాయిదా వేయడమే కేంద్ర ప్రభుత్వ అసలు లక్ష్యం.

**- మమతా బెనర్జీ, టీఎంసీ అధినేత్రి, బెంగాల్ సీఎం**



## అభివృద్ధిని పరిగణనలోకి తీసుకోవాలి

జనాభా నియంత్రణ, విద్య, ఆరోగ్యం వంటి రంగాల్లో అద్భుతంగా రాణించిన దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్యాన్ని తగ్గించడం అంటే.. అవి సాధించిన ప్రగతికి శిక్ష వేయడమే. డీలిమిటేషన్ చేసేటప్పుడు జనాభాను కాకుండా, ఆయా రాష్ట్రాల ఆర్థిక సహకారం, అభివృద్ధి సూచికలను కూడా పరిగణనలోకి తీసుకోవాలి. మహిళా రిజర్వేషన్ బిల్లును డీలిమిటేషన్, జనగణనతో ముడిపెట్టడం సరికాదు. ఇది ఒక పోస్ట్ డేటెడ్ చెక్. డీలిమిటేషన్ ప్రక్రియ పూర్తి కావడానికి చాలా సమయం పడుతుంది. మహిళలకు 33% రిజర్వేషన్లు వెంటనే అమలు చేయాలి. జనాభా ప్రాతిపదికన చేపట్టే డీలిమిటేషన్ తో రాష్ట్రాల మధ్య అసమానతలు పెరుగుతాయి.

**- డి.రాజా, సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి**

# డీలిమిటేషన్-2008

# హద్దులకే పరిమితం

### అనుసరించిన ఫార్ములా

- 2001 జనాభా లెక్కల ప్రకారం డీలిమిటేషన్ ప్రక్రియ పూర్తి. సీట్ల సంఖ్య పెంచకుండా.. కేవలం బౌండరీలను మార్చడమే ఈ డీలిమిటేషన్ ముఖ్య ఉద్దేశం. నియోజకవర్గాల మధ్య ఉన్న జనాభా అసమానతలను కట్టడి చేయడమే (ఈక్వల్ పాపులేషన్.. ఈక్వల్ రిప్రెజెంటేషన్) దీని ప్రయారిటీ.
- ఎస్సీ, ఎస్టీ జనాభా పెరిగిన ప్రాంతాల గుర్తింపు. ఆయా వర్గాలకు కేటాయించిన రిజర్వ్‌డ్ స్థానాల సంఖ్య పెంపు. భౌగోళిక పరిస్థితులు, పరిపాలనా సౌలభ్యం వంటి అంశాలు పరిగణనలోకి తీసుకొని అమలు.
- రాష్ట్రాలకు కేటాయించిన మొత్తం సీట్ల సంఖ్య మారలేదు. 1971 జనగణన ఆధారంగా ఫిక్స్ చేసిన సీట్ల సంఖ్యలో మార్పు లేకుండా కేవలం నియోజకవర్గాల విస్తీర్ణం, సరిహద్దులు మాత్రమే చేంజ్.
- పార్లమెంట్, ప్రతి అసెంబ్లీ సెగ్మెంట్‌లో సాధ్యమైనంత వరకు సమాన సంఖ్యలో జనాభా ఉండేలా సరిహద్దుల పునర్నిర్మాణం.

- డీలిమిటేషన్ యాక్ట్ 2002 ప్రకారం.. నాడు డీలిమిటేషన్ కమిషన్ చైర్మన్‌గా సుప్రీంకోర్టు రిటైర్డ్ జడ్జి జస్టిస్ కుల్దీప్ సింగ్ నియామకం.
- 2002 నుంచి 2007 వరకు దేశవ్యాప్తంగా డేటా విశ్లేషించిన కమిషన్. ప్రజాభిప్రాయ సేకరణ.
- 2008లో కమిషన్ ఫైనల్ సిఫార్సులు గెజిట్‌లో నోటిఫై అయ్యాక అమల్లోకి వచ్చాయి.
- ఈ డీలిమిటేషన్ లో సరిహద్దులు మాత్రమే మారాయి. ఎలాంటి సీట్ల పెంపు జరగలేదు. కొత్త సరిహద్దుల ప్రకారమే 2009 సాధారణ ఎన్నికలు పూర్తయ్యాయి.

### మార్పులు, చేర్పులు ఇలా..

నియోజకవర్గాల సంఖ్యలో మార్పులు లేకుండా సరిహద్దుల్ని మారుస్తూ, కొన్నింటిని రద్దు చేస్తూ, కొత్తవాటిని ఏర్పాటు చేస్తూ నిర్ణయం తీసుకున్న 2008 డీలిమిటేషన్ కమిషన్.


- 2008 డీలిమిటేషన్ తో అప్పటి ఉమ్మడి ఏపీ ప్రకారం చూస్తే తెలంగాణలో గ్రేటర్ హైదరాబాద్ విస్తరణతో కొత్తగా శేరిలింగంపల్లి, కుత్బుల్లాపూర్, ఎల్బీనగర్, రాజేంద్రనగర్ సెగ్మెంట్లు ఏర్పడ్డాయి.
- హిమాయత్‌నగర్ అసెంబ్లీ స్థానం రద్దు. పక్కనున్న సెగ్మెంట్‌లో విలీనం. ఓల్డ్ సిటీలో మారిన సరిహద్దులు. బౌండరీలు మారిన కార్వాన్ సెగ్మెంట్. కరీంనగర్ జిల్లాలో కమలాపూర్ అసెంబ్లీ రద్దు. ఇతర నియోజకవర్గాల్లో విలీనం. దీంతో హుజురాబాద్ పెరిగిన విస్తీర్ణం. కొత్తగా చొప్పదండి సెగ్మెంట్ ఏర్పాటు.
- డీలిమిటేషన్ సందర్భంగా మారని అసెంబ్లీ (294), లోక్‌సభ (42) సెగ్మెంట్లు.
- గతంలో దేశంలోనే అతిపెద్ద అసెంబ్లీ సెగ్మెంట్‌గా ఉన్న ఖైరతాబాద్ నుంచి కొత్తగా ఏర్పడిన జూబ్లీహిల్స్, శేరిలింగంపల్లి నియోజకవర్గాలు.
- బౌండరీలు మారి కొత్తగా ఏర్పడిన జహీరాబాద్ లోక్‌సభ సెగ్మెంట్. సిద్దిపేట లోక్ సభ నియోజకవర్గం కూడా రద్దు. ఇందులోని ఏరియాలు మెదక్ లోక్ సభ స్థానంలో విలీనం.
- సరిహద్దులు మారడంతో కొత్తగా ఏర్పడిన మల్కాజ్‌గిరి, చేవెళ్ల, మహబూబాబాద్ లోక్‌సభ సెగ్మెంట్లు. పాత సీట్ల సరిహద్దుల్లో మార్పు. అర్బన్ అండ్ ఎస్సీ/ఎస్టీ రిజర్వ్‌డ్‌కి అనుగుణంగా పునర్వ్యవస్థీకరణ.
- 6 సీట్ల నుంచి 7కు పెరిగిన ఎస్సీ లోక్‌సభ రిజర్వ్‌డ్ సెగ్మెంట్లు. 2 ఎస్టీ లోక్‌సభ సెగ్మెంట్ల నుంచి 3కు పెరిగిన నియోజకవర్గాలు.



### 2008 డీలిమిటేషన్ వివాదాలు

- దక్షిణాది రాష్ట్రాలు కఠినంగా జనాభా నియంత్రణను అమలు చేసినందున కేవలం జనాభా ఆధారంగా సీట్లు కేటాయిస్తే తమ ప్రాతినిధ్యం తగ్గుతుందని సౌత్ స్టేట్స్ నిరసన. కేవలం హద్దుల మార్పు వరకే పరిమితమైన కమిషన్.
- తమకు పట్టున్న ప్రాంతాలు వేరే నియోజకవర్గాల్లోకి వెళ్లాయని రాజకీయ నేతల అభ్యంతరాలు. తమ నియోజకవర్గం రిజర్వ్‌డ్ కావడంపై పలువురు పొలిటికల్ లీడర్ల నిరసనలు. ఒకే పార్టీకి లాభం చేకూర్చేలా సరిహద్దులు మారాయంటూ పలు పార్టీల నేతల ఆందోళనలు.
- పాత సెగ్మెంట్‌లతో అనుబంధం ఉన్న ప్రజలు.. తమ ప్రాంతాన్ని వేరే నియోజకవర్గంలో కలపడంపై అసంతృప్తి. గ్రామాలు లేదా మండలాలు విభజించడంతో స్థానిక గుర్తింపు కోల్పోయామన్న ప్రజలు.
- కొన్ని నియోజకవర్గాలు జనరల్ నుంచి ఎస్సీ, ఎస్టీ రిజర్వ్‌గా మారడంతో అక్కడి నాయకులు, అనుచరుల్లో అసంతృప్తి.

## అనుమానాలు నివృత్తి చేయాలి



బీజేపీ–ఆరెస్సెస్ కూటమి తమ రాజకీయ ఎజెండా కోసం జనాభా గణన, డీలిమిటేషన్ ప్రక్రియలను దుర్వినియోగం చేస్తున్నది. కేంద్రం తీరుతో జనాభా నియంత్రణను విజయవంతంగా అమలు చేసిన కేరళ, తమిళనాడు, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ వంటి రాష్ట్రాలకు రాజకీయంగా అన్యాయం జరుగుతుంది. ఈ విషయంలో ఉన్న అనుమానాలను నివృత్తి చేయడానికి కేంద్రం వెంటనే అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేయాలి. మహిళా రిజర్వేషన్ బిల్లును డీలిమిటేషన్‌తో ముడిపెట్టడం తగదు.

**- ఎంఏ బేబి, సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి**


## ఏకపక్షంగా వెళ్లొద్దు



దేశంలో ఏ కులం వారు ఎంత సంఖ్యలో ఉన్నారో తెలియనప్పుడు, నియోజకవర్గాల విభజన ఎలా శాస్త్రీయంగా ఉంటుంది? ఓబీసీ, దళిత వర్గాలకు జనాభా నిష్పత్తి ప్రకారం రాజకీయ ప్రాతినిధ్యం దక్కాలంటే ముందు కులగణన జరగాలి. జనాభా నియంత్రణ పాటించిన రాష్ట్రాల సీట్లు తగ్గడం లేదా ప్రాధాన్యం కోల్పోవడం సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధం. కేంద్రం ఏకపక్షంగా డీలిమిటేషన్ వైపు వెళ్లకుండా.. దక్షిణాది సీఎంలు వ్యక్తం చేస్తున్నఆందోళనలను పరిగణనలోకి తీసుకోవాలి.

**- అఖిలేష్ యాదవ్, సమాజ్‌వాదీ పార్టీ చీఫ్**

## రాజకీయ స్వార్థం ఉండొద్దు



మహిళా రిజర్వేషన్ అమలు కావాలంటే.. డీలిమిటేషన్, జనగణన వరకు ఆగాల్సిన అవసరం లేదు. ఇది కేవలం మహిళలను మోసం చేయడానికి, అమలును దశాబ్దాల పాటు వాయిదా వేయడానికి కేంద్ర ప్రభుత్వం వేసిన ఎత్తుగడ. వెంటనే మహిళా రిజర్వేషన్లను అమలు చేయాలి. ఒకవేళ డీలిమిటేషన్ జరిగే వరకు ఆగాల్సి వస్తే, ఆ లోపు తగిన చర్యలు వేగంగా తీసుకోవాలి. కేంద్రం, రాష్ట్రాల మధ్య డీలిమిటేషన్ విషయంలో జరుగుతున్న వివాదాలు రాజకీయ స్వార్థం కోసం కాకుండా.. దేశ ప్రయోజనాల కోసం ఉండాలి.

**- మాయావతి, బీఎస్పీ చీఫ్**

# నాలుగుసార్లు డీలిమిటేషన్

**రాజ్యాంగంలోని ఆర్టికల్ 82, ఆర్టికల్ 170 ప్రకారం.. ప్రతి జనగణన తర్వాత పార్లమెంట్/అసెంబ్లీ నియోజకవర్గాల సరిహద్దులు మార్చే విధానం ఉంది. స్వాతంత్ర్యం వచ్చాక నాలుగుసార్లు డీలిమిటేషన్ చేపట్టారు. ప్రతిసారి పార్లమెంట్ కొత్త డీలిమిటేషన్ చట్టం చేసుకోవాలి. దాని ఆధారంగా డీలిమిటేషన్ కమిషన్ ఏర్పాటవుతుంది. 1976లో 42వ రాజ్యాంగ సవరణ ద్వారా 1971 నుంచి 2001 మధ్య డీలిమిటేషన్ ప్రక్రియ వాయిదా. దీనికి కారణం.. పాపులేషన్ గ్రోత్ ఇన్‌బ్యాలెన్స్‌ను దృష్టిలో పెట్టుకుని.. ఒకే రాష్ట్రానికి ఎక్కువ సీట్లు వస్తే డెమోగ్రఫిక్ ఇన్‌బ్యాలెన్స్ అవుతుంది. 2002లో జస్టిస్ కుల్దీప్ సింగ్ చైర్మన్‌గా డీలిమిటేషన్ కమిషన్ ఏర్పాటు. 2008లో ఫైనల్ ఆర్డర్లు రిలీజ్.**

## మొదటి డీలిమిటేషన్ (1952)


తొలి డీలిమిటేషన్ కమిషన్ చైర్మన్‌గా సుప్రీంకోర్టు రిటైర్డ్ జడ్జి జస్టిస్ ఎన్.చంద్రశేఖర్ అయ్యర్. సభ్యుడిగా జస్టిస్ పీకే కౌల్ (హైకోర్టు రిటైర్డ్ జడ్జి), ఎక్స్ అఫీషియో సభ్యుడిగా అప్పటి తొలి ప్రధాన ఎన్నికల కమిషనర్ సుకుమార్ సేన్. ఈ కమిషన్ తన విధుల్లో సహాయం కోసం ప్రతి రాష్ట్రం నుంచి జనాభా ప్రాతిపదికన కొంత మంది అసోసియేట్ సభ్యులు (ఎంపీలు, ఎమ్మెల్యేలు) కూడా నియమించుకునే అధికారం. అయితే, వారికి ఓటేసే అధికారం ఉండదు.

- ఈ కమిషన్ జారీ చేసే ఉత్తర్వులకు చట్టపరమైన బలం ఉంటుంది. ఉత్తర్వులను ఏ కోర్టులోనూ సవాల్ చేసే వీలుండదు. ఈ ఉత్తర్వులను పార్లమెంట్ లేదా అసెంబ్లీలు సవరించలేవు.
- 1951 జనాభాల లెక్కల ఆధారంగా లోక్‌సభ, అసెంబ్లీ నియోజకవర్గాల పునర్వ్యవస్థీకరణ.
- 1951–52లో 489 లోక్‌సభ స్థానాలు. డీలిమిటేషన్ కమిషన్ వాటిని 494కు పెంచాలని సిఫార్సు. 494 స్థానాల ఆధారంగానే 1957, 1962 సాధారణ ఎన్నికల నిర్వహణ.
- రాష్ట్రాల జనాభా ప్రాతిపదికన అసెంబ్లీ స్థానాల ఏర్పాటు. డీ లిమిటేషన్‌కు ముందు 3,203 సీట్లు.. 1952 డిలీమిటేషన్ తర్వాత 3,405 స్థానాలకు పెంపు. 1956లో జరిగిన రాష్ట్రాల పునర్ వ్యవస్థీకరణ. 3,771కు పెరిగిన మొత్తం అసెంబ్లీ సీట్లు.
- ఏపీలో 41 స్థానాల్లో మార్పు లేదు. 301 ఉన్న అసెంబ్లీ స్థానాలు 287కు తగ్గాయి. 1951 జనాభా ప్రాతిపదికన కొన్ని ఏరియాల్లో తక్కువ జనం ఉండటం, రూరల్ /అర్బన్ పాపులేషన్ బ్యాలెన్స్ కోసం తగ్గిన అసెంబ్లీ సీట్లు.
- 1952 డీలిమిటేషన్ చట్టం ప్రకారం.. ప్రతి రాష్ట్ర అసెంబ్లీ స్థానాల సంఖ్య ఆ రాష్ట్రానికి కేటాయించిన లోక్‌సభ స్థానాలకు 5 నుంచి 12 రెట్లు ఉండాలని నిర్ణయం.
- ఫస్ట్ టైమ్ జనాభా ప్రాతిపదికన ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ల నిర్ణయం.

## రెండో డీలిమిటేషన్ (1963)

1963లో జరిగిన రెండో డీలిమిటేషన్ కమిషన్ చైర్మన్‌గా సుప్రీం కోర్టు రిటైర్డ్ జడ్జి జస్టిస్ జేఎల్ కపూర్. సభ్యుడిగా జస్టిస్ సీపీ సిన్హా (హైకోర్టు రిటైర్డ్ జడ్జి), ఎక్స్ అఫీషియో సభ్యుడిగా అప్పటి ప్రధాన ఎన్నికల కమిషనర్ కేవీకే సుందరం.

- 1956లో జరిగిన రాష్ట్రాల పునర్వ్యవస్థీకరణ తర్వాత మొదటి పూర్తి స్థాయి కమిషన్ ఇది. 1961 జనాభా లెక్కల ఆధారంగా లోక్‌సభ, అసెంబ్లీ నియోజకవర్గాల సంఖ్య పెంపు.
- లోక్‌సభ స్థానాలు 494 నుంచి 522కు పెంపు. అసెంబ్లీ స్థానాలు 3,405 నుంచి 3,561కు పెంపు. అప్పటి ఏపీ అసెంబ్లీ స్థానాల సంఖ్య 287 నుంచి 294కు పెంపు. లోక్‌సభ స్థానాలు 41కే పరిమితం.
- అంతకుముందు అమల్లో ఉన్న ఒకే నియోజకవర్గం నుంచి ఇద్దరు అభ్యర్థులు ఎన్నిక విధానం రద్దు. ఒక నియోజకవర్గం నుంచి ఒక్కరే ఎన్నికయ్యేలా సింగిల్ మెంబర్ విధానం పటిష్టం.
- 1960లో బాంబే రాష్ట్రం విడిపోయి మహారాష్ట్ర, గుజరాత్ ఏర్పడటం.. అలాగే, ఇతర రాష్ట్రాల సరిహద్దుల్లో వచ్చిన మార్పుల తర్వాత నియోజకవర్గాలను శాస్త్రీయంగా విభజించిన ఘనత ఈ కమిషన్‌దే.



## మూడో డీలిమిటేషన్ (1973)

1973లో జరిగిన మూడో డీలిమిటేషన్ కమిషన్ చైర్మన్‌గా సుప్రీం కోర్టు రిటైర్డ్ జడ్జి జస్టిస్ జేఎల్ కపూర్ (రెండో కమిషన్‌కు కూడా ఈయనే నాయకత్వం). సభ్యుడిగా జస్టిస్ తారాచంద్ మోత్వానీ (హైకోర్టు రిటైర్డ్ జడ్జి), ఎక్స్ అఫీషియో సభ్యుడిగా అప్పటి ప్రధాన ఎన్నికల కమిషనర్ స్వామినాథన్.

- 1971 జనాభా లెక్కల ఆధారంగా లోక్‌సభ, అసెంబ్లీ స్థానాల పెంపు.
- లోక్‌సభ స్థానాల సంఖ్యను 522 నుంచి 542కు పెంచాలని కమిషన్ సిఫార్సు. తర్వాత సిక్కిం చేరికతో ఇది 543కు చేరిక. ఈ సీట్లలో 78 ఎస్సీలకు, 38 ఎస్టీలకు రిజర్వ్.
- ఆంధ్రప్రదేశ్‌లో లోక్‌సభ సీట్లు 41 నుంచి 42కు పెంపు. 287 నుంచి 294కు పెరిగిన అసెంబ్లీ సీట్ల సంఖ్య (ఇప్పుడున్న తెలంగాణకు 119, ఏపీకి 175 సీట్లు).
- 1973 డీలిమిటేషన్ తర్వాత 1976లో ఇందిరా గాంధీ సర్కార్ 42వ రాజ్యాంగ సవరణ. 1971 జనాభా లెక్కల ఆధారంగా నిర్ణయించిన సీట్ల సంఖ్యను 2001 వరకు మార్చొద్దని చట్టం.
- ఉత్తరాది రాష్ట్రాల్లో జనాభా వేగంగా పెరుగుతుంటే.. దక్షిణాది రాష్ట్రాలు కుటుంబ నియంత్రణ పాటిస్తున్నాయి. జనాభా ప్రాతిపదికన సీట్లు పెంచితే నియంత్రణ పాటించిన రాష్ట్రాలు రాజకీయంగా నష్టపోతారనే కారణంతో 42వ రాజ్యాంగ సవరణ.



## నాల్గో డీలిమిటేషన్ (2002)

2002లో ఏర్పాటై 2008లో నివేదిక సమర్పించిన నాల్గో డీలిమిటేషన్ కమిషన్ చైర్మన్‌గా సుప్రీంకోర్టు రిటైర్డ్ జడ్జి జస్టిస్ కుల్దీప్ సింగ్. సభ్యుడిగా జస్టిస్ బీసీ బెనర్జీ (హైకోర్టు రిటైర్డ్ జడ్జి). ఎక్స్ అఫీషియో సభ్యులు మారుతూ వచ్చారు. ఈ కమిషన్ 2002 నుంచి 2008 వరకు కొనసాగడంతో ఆ సమయంలో పదవిలో ఉన్న ప్రధాన ఎన్నికల కమిషనర్లు జేఎం లింగ్డో, టీఎస్ కృష్ణమూర్తి, బీబీ టాండన్, ఎన్. గోపాల స్వామి ఎక్స్‌అఫీషియో సభ్యులుగా వ్యవహరించారు.

- ఈ కమిషన్ మునుపటి కమిషన్ల కంటే భిన్నమైనది. ఎందుకంటే ఇది సీట్ల సంఖ్యను పెంచకుండా, కేవలం నియోజకవర్గాల అంతర్గత సరిహద్దులను మాత్రమే మార్చింది.
- 2001 జనాభా లెక్కల ఆధారంగా డీలిమిటేషన్ ప్రక్రియ చేపట్టింది.
- 2001లో చేసిన 84వ రాజ్యాంగ సవరణ ప్రకారం.. 1971 నాటి లోక్‌సభ, అసెంబ్లీ సీట్ల సంఖ్యను 2026 వరకు మార్చకూడదు.
- జనాభా మార్పులకు అనుగుణంగా నియోజకవర్గాల సరిహద్దులను మళ్లీ గీయడం. అంటే, ఒకే నియోజకవర్గంలో జనాభా విపరీతంగా పెరగడం లేదా తగ్గడం వంటి అసమానతలను తొలగించడం.
- కొన్ని కీలక అంశాలను పరిగణనలోకి తీసుకున్న కమిషన్. నియోజకవర్గాలు భౌగోళికంగా విడివిడిగా ఉండొద్దు. వీలైనంత వరకు జిల్లా, మండలం లేదా రెవెన్యూ డివిజన్ల సరిహద్దులను దాటకుండా చూడటం.
- ఎస్సీ రిజర్వ్‌డ్ స్థానాలను ఆయా వర్గాల జనాభా సాంద్రత ఎక్కువగా ఉన్న వివిధ ప్రాంతాలలో పంపిణీ చేయడం. ఎస్టీ స్థానాలను వారి జనాభా అత్యధికంగా ఉన్న చోట కేటాయించడం.
- జనాభా పెరిగిన హైదరాబాద్, బెంగళూరు, ఢిల్లీ వంటి నగరాల్లో అసెంబ్లీ సీట్ల సంఖ్య పెరిగింది. (పల్లెల్లోని సీట్లు రద్దయి నగరాల్లోకి మారాయి).

## అలా చేస్తే సౌత్‌కు శిక్షే..


ప్రస్తుతం దక్షిణాది రాష్ట్రాలకు 130 ఎంపీ సీట్లు (24%) ఉన్నాయి. ఒకవేళ జనాభా ప్రాతిపదికన సీట్లు పెంచితే, దక్షిణాది వాటా 19 శాతానికి పడిపోతుంది. ఉత్తరాదిలోని 5 పెద్ద రాష్ట్రాలు కలిస్తేనే కేంద్రంలో ప్రభుత్వం ఏర్పడే పరిస్థితి వస్తుంది. అప్పుడు దక్షిణాది రాష్ట్రాల మద్దతు కేంద్రానికి అవసరం ఉండదు. డీలిమిటేషన్ ప్రక్రియను దక్షిణాదిపై ప్రయోగిస్తున్న చివరి బుల్లెట్. జనాభా నియంత్రణను పాటించినందుకు దక్షిణాదికి కేంద్రం వేసే శిక్ష ఇది. ఏపీ పునర్విభజన చట్టం ప్రకారం తక్షణమే తెలంగాణలో అసెంబ్లీ సీట్లను 119 నుంచి 153కి పెంచాలి.



**- రేవంత్ రెడ్డి, తెలంగాణ సీఎం**

## జనాభా కొలమానం కావొద్దు


జనాభా నియంత్రణను సమర్థవంతంగా అమలు చేసిన తెలంగాణ, ఏపీ వంటి రాష్ట్రాలు డీలిమిటేషన్ ప్రక్రియతో లోక్‌సభలో తమ ప్రాతినిధ్యాన్ని కోల్పోయే ప్రమాదం ఉంది. కేంద్రం సూచన మేరకు జనాభా నియంత్రణ పాటించి, అభివృద్ధి పథంలో దూసుకుపోతున్న దక్షిణాది రాష్ట్రాలకు ఇది ఒక శిక్ష లాంటిది. కేవలం జనాభా ప్రాతిపదికన సీట్లను పెంచితే.. జనాభాను పెంచుకున్న ఉత్తరాది రాష్ట్రాలకు రాజకీయంగా లాభం చేకూరుతుంది. నియోజకవర్గాల విభజనకు కేవలం జనాభా మాత్రమే కొలమానం కావొద్దు. పనితీరు కూడా ఒక ప్రాతిపదిక కావాలి.



**- కేటీఆర్, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్**

## ఉత్తరాది ఆధిపత్యం పెరుగుతుంది

జనాభా నియంత్రణను సమర్థవంతంగా పాటించిన దక్షిణాది రాష్ట్రాలను కేంద్రం శిక్షిస్తున్నది. కేవలం జనాభా ప్రాతిపదికన లోక్‌సభ సీట్లు పెంచితే.. ఉత్తరాది రాష్ట్రాల (ముఖ్యంగా హిందీ బెల్ట్) ఆధిపత్యం పెరిగి, దక్షిణాది రాష్ట్రాల రాజకీయ ప్రాధాన్యత తగ్గిపోతుంది. ఇది దేశంలో పెద్ద ఎత్తున సామాజిక ఉద్యమాలకు దారితీస్తుంది. డీలిమిటేషన్ ద్వారా మహిళలకు సీట్లు కేటాయించేటప్పుడు అందులో ముస్లిం మహిళలకు, ఓబీసీ మహిళలకు ప్రత్యేక కోటా ఉండాలి. డీలిమిటేషన్ సాకుతో మహిళా రిజర్వేషన్‌ను 2029 లేదా ఆ తర్వాతకు వాయిదా వేయడం మహిళలను మోసం చేయడమే.



**- అసదుద్దీన్ ఒవైసీ, ఎంఐఎం అధినేత**



## కేంద్రం అన్యాయం చేయదు

డీలిమిటేషన్.. ఏదో ఒక పార్టీ రాజకీయ ప్రయోజనాల కోసం చేస్తున్నది కాదు. ఇది రాజ్యాంగం నిర్దేశించిన నిబంధనల ప్రకారం జరిగే ప్రక్రియ. జనాభా పెరుగుదలకు తగ్గట్టు ప్రజలకు మెరుగైన ప్రాతినిధ్యం కల్పించడమే దీని ప్రధాన ఉద్దేశం. మహిళా రిజర్వేషన్ బిల్లు అమలు కావాలంటే డీలిమిటేషన్ తప్పనిసరి. చట్టబద్ధంగా, సాంకేతికంగా నియోజకవర్గాల సరిహద్దులు ఖరారు కాకుండా మహిళలకు ఏ సీట్లు కేటాయించాలో నిర్ణయించడం సాధ్యం కాదు. అందుకే ప్రధాని మోదీ ప్రభుత్వం దీనిని డీలిమిటేషన్‌తో ముడిపెట్టింది. కేంద్రం ఏ రాష్ట్రానికి అన్యాయం చేయదు. రాష్ట్రాల ప్రయోజనాలను కాపాడుతుంది.

**- రాంచందర్ రావు, బీజేపీ స్టేట్ చీఫ్**

## దక్షిణాది నుంచి ఇద్దరే ప్రధానులు

**దేశానికి ఇప్పటివరకు15 మంది ప్రధానమంత్రులు అయ్యారు. ఇందులో 10 మంది ఉత్తరాది రాష్ట్రాలకు (ముఖ్యంగా హిందీ బెల్ట్) చెందినవారే. కేవలం ఇద్దరే దక్షిణాది నుంచి ప్రధాన మంత్రులు అయ్యారు. వీరిలో తెలంగాణ నుంచి పీవీ నరసింహారావు దక్షిణాది నుంచి ఎన్నికైన తొలి ప్రధాని. ఈయనను 'దేశ ఆర్థిక సంస్కరణల పితామహుడు'గా పేర్కొంటారు. కర్నాటక నుంచి హెచ్‌డీ దేవెగౌడ ప్రధాని అయ్యారు. ఈయన యునైటెడ్ ఫ్రంట్ ప్రభుత్వంలో ప్రధానిగా చేశారు. ఉత్తరాదితో పోలిస్తే ప్రధానమంత్రి పదవిలో దక్షిణాది ప్రాతినిధ్యం చాలా తక్కువే.**





# సౌత్ వాదన వెనుక ఆవేదన

జనాభా ప్రాతిపదికన డీలిమిటేషన్ చేపడితే కేంద్రంలో తమకు తీవ్ర అన్యాయం జరుగుతుందని సౌత్ స్టేట్స్ కేరళ, తమిళనాడు, తెలంగాణ, ఏపీ, కర్నాటక వాదిస్తున్నాయి. ఈ వాదన వెనుక ఆవేదన దాగి ఉంది. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి కేంద్రంలోని అన్నిరంగాల్లో తమకు తగిన ప్రయారిటీ దక్కడం లేదని దక్షిణాది రాష్ట్రాలు అంటున్నాయి. ఎన్నో అంశాలను గుర్తుచేస్తున్నాయి. ఇప్పుడు జనాభా దామాషా ప్రకారం డీలిమిటేషన్ చేపడితే.. అన్యాయం ఇంకా పీక్స్ కు చేరుతుందని అంటున్నాయి. జనాభా నియంత్రణను నార్త్ తో పోలిస్తే సౌత్ పటిష్ఠంగా అమలు చేసింది. దీని వల్ల సౌత్ లో జనాభా తగ్గిపోయింది. నార్త్‌లో మాత్రమే పెరిగింది. ఆ లెక్కలనే పరిగణనలోకి తీసుకొని డీలిమిటేషన్ చేపడితే నార్త్ కు ఎక్కువ సీట్లు వస్తాయని, దీంతో కేంద్రంలో తమ ప్రాతినిధ్యం మరింత క్షీణిస్తుందని సౌత్ వాదన. కీలకమైన ప్రధానమంత్రి పదవి సహా ఏ ప్రధాన పోస్టు చూసుకున్నా సౌత్‌కు అన్యాయమే జరిగిందని.. ఇప్పుడు జనాభా ప్రాతిపదికన డీలిమిటేషన్ చేపడితే మరింత అన్యాయం జరుగుతుందని దక్షిణాది రాష్ట్రాల పొలిటికల్ లీడర్స్ గుర్తుచేస్తున్నారు. దేశంలో ఉత్తర, దక్షిణ ప్రాంతాల మధ్య జనాభా, ఆర్థిక, రాజకీయ, సామాజిక అంశాల్లో భారీ గ్యాప్ ఉంది. జనాభా పెరుగుదల నుంచి ఆర్థిక అభివృద్ధి వరకు నార్త్, సౌత్ మధ్య స్పష్టమైన తేడాలు కనిపిస్తాయి.

### ఉత్తరాదిలో ఇలా..!

ఉత్తరాది రాష్ట్రాలు ఒకే అధికార భాష (హిందీ బెల్ట్) కలిగిన 10పైగా ప్రాంతాలు. ఇక్కడ జనాభా సుమారు 65 – 70 కోట్లు. దేశ జనాభాలో దాదాపు 45–50% వాటా. దేశ విస్తీర్ణంలో 32–34 % వాటా. లోక్ సభ సీట్లు 200 పైన. దేశ జీడీపీలో 32–34 % వాటా. ఈ రాష్ట్రాలకు కేంద్ర నిధుల పంపిణీ అధికం. జనసాంద్రత ఎక్కువే, జనాభా పెరుగుదల రేటు అధికమే. ఇలా దేశంలో ఉత్తరాది రాష్ట్రాలది సింహభాగం. ఇక్కడ రాజకీయ ప్రాతినిధ్యం ఎక్కువే. కేంద్రానికి రాష్ట్రాలు చెల్లించే ప్రతి 1 రూపాయికి, తిరిగి రూ. 2 నుంచి రూ. 7 వరకు నార్త్ కే వెళ్తున్నాయన్నది సౌత్ రాష్ట్రాల వాదన. ఉత్తరాదికి జనాభా ప్రాతిపదికన ఎక్కువ నిధులు అందుతున్నాయని చెప్తున్నాయి. డీ లిమిటేషన్ లో జనాభా ఆధారంగా ఉత్తరాదికి లోక్ సభలో సీట్లు కూడా పెరుగుతాయి. తద్వారా రాజకీయ ఆధిపత్యం కూడా పెరుగుతుందనే ఆందోళన దక్షిణాది నేతల నుంచి వినిపిస్తున్నది.

### దక్షిణాదిలో ఇలా..!

ద్రవిడ భాషలు మాట్లాడే దక్షిణాది రాష్ట్రాలు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కర్నాటక, కేరళ, కేంద్రపాలిత ప్రాంతమైన పుదుచ్చేరి. ఇవి దేశంలో భౌగోళికంగా, సాంస్కృతికంగా ప్రత్యేకత కలిగినవి. జనాభా సుమారు 28 – 30 కోట్లు. దేశ జనాభాలో 19– 20% వాటా. దేశ విస్తీర్ణంలో 19% వాటా. లోక్ సభ సీట్లు 130. దేశ జీడీపీలో 30–31% వాటా సౌత్ దే. కేంద్రం నిధులు పంపిణీ కేవలం 15–16 %. దక్షిణాది రాష్ట్రాల్లో జనాభా వృద్ధి రేటు తగ్గింది. కుటుంబ నియంత్రణను పటిష్ఠంగా అమలు చేయడమే ఇందుకు కారణం. జనాభా తక్కువే కానీ.. ఆర్థిక ఉత్పత్తి ఎక్కువ. ఇక్కడి నుంచి కేంద్రానికి చెల్లించే ప్రతి 1 రూపాయి పన్నుకు వచ్చేది సగటున 50 పైసలు దాటడం లేదని లీడర్లు అంటున్నారు. ఐదు రాష్ట్రాలకు కలిపి ఈ వాటా కేవలం 15.8% ఉందని చెప్తున్నారు. జనాభా ప్రాతిపదికన, ఏకపక్షంగా డీలిమిటేషన్ చేపడితే.. జనాభా నియంత్రణ పాటించిన దక్షిణాదికి రాజకీయంగా ప్రాధాన్యం తగ్గుతుందనేది ప్రధాన ఆందోళన.